కథానిక

# మించిపోయిన తరుణం

'రాజా'

ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి, పంజాబు మెయిలులాగ పరుగెత్తుకొంటూ చెప్ప వచ్చాడు బాచిగాడు. ఆవేళ ఆరో తారీకని, ఆ వేళటివరకూ జీతాలు రాకపోవడం మూలాన వాళ్ల నాన్న చాలా చిరాకుగా ఉన్నాడని ఆ పదేండ్ల కుర్రవాడికి ఏం తెలుసు? బాకీదార్లు చెప్పినా నమ్మరుకదా, కర్మం. 'డబ్బు చేతికొచ్చి నపుడుకూడ అలా యిదవుతారే' అని సతాయి స్తారు. తెల్లారి లేవగానే పెరుగావిడతో అయింది ఒక తగవు. 'రేపటి' నుంచి యిక పెరుగే పొయ్యనంది. మాట పట్టింపుకోసం 'నువ్వు రాక పోతే నీతాత యింకొకళ్లు' అని అన్నాడే కాని, తీరాచేసి 'రేపు' పెరుగు ముసలమ్మ రాకపోతే చెయ్యబోతున్నదేమిటో తనకే తెలియదు. ఆఫీసు కెళ్తుంటే సాహుకారు కనిపించి "ఈ నెలలో డబ్బుకి కొంచెం ఇబిగా ఉందండీ, ఎలాగైనా పూర్తిగా చూడాలిసుమండీ" అంటూ ఘాటుగా హెచ్చరించాడు. "జీతాలు రాగానే బాకీలు తీర్చకపోతే రూపాయలు తింటామేమిటయ్యా" అన్నాడు, పెరుగు ముసలమ్మలాగే చిందులు త్రొక్కుతాడేమో అన్న భయంవల్ల చిన్న వినపు నవ్వు నవ్వుతో—ఇలాగే ఒకరేమిటి, అయ్యరు లగాయితు బీడీల కొట్టు పెట్టిన శివయ్యవరకూ ఎవరికి తోచినట్టు వారు హెచ్చరించి వదిలే శారు. రాబోయే జీతానికి అప్పుడే 'బడ్జట్' తయారుచేసేసి, ఒక పదిరూపాయలు శ్రావణ శుక్రవారంనాటి దేవతార్చనకి కేటాయించేసింది ఇంటావిడ. వ్యయపట్టికని ఎలా సవరించడమా అని తల్లక్రిందుగా తపస్సు చేస్తున్నాడు — దక్కన్ సిగరెట్ పొగ శ్రావణమాస మేఘా ల్లాగ గాలిలోకి వదుల్తూ. ఆర్థిక దుస్థితితో తల బ్రద్దల కొట్టుకొంటున్న సుబ్బారావుకి అటువంటి వార్త ఆక్షణములో చెవిబడిందంటే అతనికి ఎంత బాధకలిగినా కలుగుతుంది.

బంతిలాగ గెంతుకొంటూ వచ్చిన బాచి గాణ్ణి రెక్కపట్టుకొని ఆపి, "ఏమిటిరా ఈ హడావుడి!" అన్నాడు సుబ్బారావు ప్రశ్నార్థ కంగా.

"కాంగ్రెసులో పని చేసినందుకు ఎకరాలు ఇచ్చారుట-" హడావుడిగా జవా బిచ్చాడు.

అంత ఆలోచన మధ్యలో పానకంలో పుడక లాగ తయారయాడేమిటని నిజానికి చాలా చిరాకేసింది సుబ్బారావుకి బాచిగాడిమీద.

"ఎవరికిరా, ఏం ఎకరాలు ?" అన్నాడు వింతగా.

"కిష్టాయ్ నాన్నకే, నాన్నా, ఎకరాలే, యిచ్చారుట-వాళ్ళనాన్నకి ఇప్పుడు బోలెడంత డబ్బు ఉందిట - వాళ్ళ కిష్టాయే చెప్పాడు." అన్నాడు, అమాయకంగా తండ్రి కళ్ళలోకి చూస్తూ—

కిష్టాయ్ నాన్న సీతారామయ్య, సుబ్బా రావు యిద్దరూ ఒక ఊళ్ళోనే పుట్టారు; ఒక చోటే పెరిగారు. చిన్నప్పటినుంచీకూడా పెద్ద స్నేహితులు. చదువులో అంతటి మొద్దు ఇక ఈ భూమిమీద పుట్టి పెరగడని రాగి పట్టామీద వ్రాసియిస్తాము అంటుండేవారు మేష్టర్లు అందరూ ఆ సీతారామయ్యగురించి. ప్రతీక్లాసూ మూడేళ్లకు తక్కువగాకుండా చదివి మేష్టర్ల దయ వల్ల ఏదో గెంటుకొస్తుండేవాడు.

తను ఎలా చదివేవాడు? ఎప్పుడూ స్కూలుకి ఫస్టే కాని మరొకటి ఎప్పుడూ లేదు. స్కూలు స్కూలు యావత్తూ, అంటే 'ప్యూన్స్' సమేతం, కూడా తన చదువు విషయంలో తనని ఎంత పొగడేవారూ!

కాని ఈ విషయాన్ని వాడు ఎప్పుడూ ఒప్పుకొనేవాడు కాదు. నువ్వు 'బుక్ వర్మ్' (పుస్తకాన్ని చెదలాగ పట్టేసినవాడు) వురా అంటూనే వేళాకోళం ఆడేవాడు. కాని ఎప్పటి

కైనా బాగా చదివే తనే బాగుపడాల్సిందే కాని ఆ మొద్దబ్బాయి సీతారామయ్య ఎందుకు పనికివస్తాడో చూద్దాము అన్నట్టుగా మొగం పెట్టి ఊరుకొనేవాడు సుబ్బారావు.

తర్వాత తర్వాత చదవలేక మానివేసి, ఊరివెంట తిరుగుతూండేవాడు సీతారామయ్య. ఈలోగా రాజకీయాలు బాగా అత్తుకొన్నాయి.

మీటింగులు, ఉపన్యాసాలు, సత్యాగ్రహాలు అంటుండేవాడు. సీతారామయ్య నాన్నకి మాత్రం వాడి వాలకమేమీ నచ్చలేదు. ఏమన్నా ఉద్యోగం చేస్తాడా అంటే చదువు లేదాయె. పోనీ కృష్ణా, రామా అనుకొంటూ ఏ వ్యవసాయం అయినా చేస్తాడా అంటే అదీ చేతకాదాయె. నేర్చుకొందామనే కుతూహలం కూడా లేదు. పైగా ఉన్న రెండెకరాలు మార్చుకు తింటూ దేశం కోసం తగలేస్తాను అంటుంటే వాళ్ళ నాన్నకి లోపల లోపల చాలా బాధగానే ఉండేది. వాడి కర్మం, బికారి అయే యోగం ఉంటే ఎవరు తప్పించగలరు అని ఊరుకొనేవాడు.

మొట్టమొదటినించీ వాళ్ళనాన్న సుబ్బారావు విషయంలో అంత శ్రద్ధతీసికొని ఉండక పోతే, సుబ్బారావుకూడా సీతారామయ్యతో బాటే ఒక సుప్రసిద్ధ దేశభక్తుడు కావలసిందే. ఇదేఈమధ్య సీతారామయ్యని చూస్తున్న సుబ్బారావు అప్పుడప్పుడు అనుకొంటూంటాడు. కాని అప్పట్లో సుబ్బారావు ఉద్దేశాలే వేరుగా ఉండేవి. తాను పెద్ద ఉద్యోగంచేస్తూ శివిగా గడుపుతుంటే, సీతారామయ్య ఏమీ లేకుండా ఊరికే తిరుగుతూ నలుగురిచేతా వేలెత్తి చూపించుకొంటుంటాడు గదా అనుకొనేవాడు సుబ్బారావు.

కాని సుబ్బారావు యింటర్ ప్యాసయేసరికే వాళ్ల నాన్న పరలోకయాత్ర చేయడం, తన చదువుకు భరతవాక్యం పలికించడం, తర్వాత తర్వాత ఆతాలూకాఆఫీసులో అష్టకష్టాలుపడి డెబ్బయిఅయిదు రూపాయల ఉద్యోగం సంపాదించుకోవడం జరిగింది.

కాని పాటుపడని సీతారామయ్యని సత్యాగ్రహం చేసినందుకు 'తెల్లహాయాం' అరెస్ట్‌చేసి రెండేళ్ల శిక్ష విధించింది.

సీతారామయ్యకోసం బెంగపెట్టుకొనే చచ్చి పోయాడు వాళ్ల నాన్న.

రెండేళ్ల అనంతరం సీతారామయ్యని విడుదల చేశారు. చేతిలో కానీ లేదు.

అందితే జుట్టు, అందకపోతే కాళ్ల పట్టుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నాడు. మొగం మీద కాకపోయినా చాటునయినా అనుకోవడం ప్రారంభించారు. సీతారామయ్య నిర్వాకాన్ని ఎక్కువగా దూషించడం మొదలుపెట్టిన వారిలో సుబ్బారావుది పైచెయ్యి అయింది.

'తూ, బలాదూర్, నేను సంపాదించే రోజులు వస్తాయి చూడరా' అని నోటికి తాళం వేస్తుండే వాడు సీతారామయ్య.

భారతదేశానికి ఇంత త్వరలో స్వరాజ్యం వస్తుందని ఏమాత్రం ఆశ ఉన్నా సుబ్బారావు చదువుని పట్టుకొని అంత ప్రాకులాడక పోవును.

ఐదేళ్ళలో అంతా తారుమారయి పోయింది.

స్వతంత్ర భారతంలో సీతారామయ్య పెద్ద నాయకుడై పోయాడు.

దేశానికి స్వాతంత్ర్యం రావడమే సుబ్బారావుకు ముప్పయి పోయింది. దాని కంతటికీ కారణం సీతారామయ్య ఆధిక్యమే.

మొన్న పార్కులో కనిపించి అన్నాడు కూడా 'ఇక మా రోజులురా, జాగ్రత్తగా మసులుకోండి' అని—

తన ఉద్యోగంలో ఎదుగూ, బొదుగూ లేక పోవడం అటుంచి చూస్తుండగానే సీతారామయ్య ఇంతవాడయి పోవడం సుబ్బారావుకి బాధగానే ఉంది.

సుబ్బారావు దృష్టిలో సీతారామయ్య ఈనాడు ఒక పెనుభూతం.

గొంతుకలోని కాలకూట విషాన్ని గుటకల ద్వారా లోపలికి దిగమ్రింగుతూ దూలాలు లెక్కకడుతున్నాడు సుబ్బారావు—తను కూడా ఒక నాయకుడు అవడానికి ఎందుకు ప్రయత్నించ లేదా అని.